సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 9 । మే । 2025



వాహనాలపై కేసులు

త్రైమాసిక పన్ను చెల్లించకుండా నడుపుతున్న రవాణా వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్టు డీటీసీ కరీమ్ తెలిపారు.

10లో ▸



అక్రమ పట్టుబడులు

కొల్లేరు అభయారణ్యంలో అక్రమ సాగు యథేచ్ఛగా సాగుతోంది. కైకలూరు మండలం చటాకాయి గ్రామంలో అక్రమ సాగు చేస్తున్నారు.

10లో ▸



10న వాలీబాల్ సెలెక్షన్స్

భీమవరం డీఎన్నార్ కళాశాలలో వాలీబాల్ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఈనెల 10న ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

10లో ▸

ప్రజా గొంతును నొక్కొద్దు



ప్రజల పక్షాన పోరాడే పత్రికల గొంతును నొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసుల నిర్బంధ సోదాలను ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛకు ఎవరూ భంగం కలిగించకూడదు. ఇటువంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించినట్లుగానే భావించాల్సి వస్తోంది. పత్రికా ఎడిటర్ స్థాయి వ్యక్తిని భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరం.

– దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

జర్నలిజంపైనా దాడులు



ప్రభుత్వానికి అనుకూలంగా వార్తలు రాయకపోతే జర్నలిజంపైనా దాడులు చేసే పరిస్థితి రాష్ట్రంలో దాపురించింది. రాజకీయ ఒత్తిళ్ల తోనే బెదిరింపులకు పాల్పడినట్లుగా ఉంది. కూటమి పాలనలో అనుకూలంగా లేని పత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా నిర్వాహకులపై దాడులకు దిగడం పరిపాటిగా మారింది. రానున్న రోజుల్లో ఇవన్నీ మీకు రిటర్న్ గిఫ్టులుగా వస్తాయి.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

ప్రశ్నిస్తే కేసులు పెడతారా ?



'సాక్షి' ఎడిటర్ ఇంటిపై పోలీసులు దాడి ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సోదాలు సరి కాదు. 'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే కేసులు పెడతారా? ఇటువంటి చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలి.

– తెల్లం రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పోలవరం సమన్వయకర్త

కలం గళంపై కక్ష సాధింపు

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

- 'సాక్షి' ఎడిటర్ నివాసంపై పోలీసుల దాడి సిగ్గు సిగ్గు
- విలేకరుల స్వేచ్ఛను హరిస్తే తీవ్ర పరిణామాలు
- ఉమ్మడి పశ్చిమలో కదం తొక్కిన జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయులు
- కొయ్యలగూడెంలో మాజీ ఎమ్మెల్యే బాలరాజు భారీ నిరసన ప్రదర్శన



ఏలూరు : ఏలూరులో డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



భీమవరం: భీమవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధింపులకు తెరతీసింది. పత్రికా స్వేచ్ఛను కాలరాసేలా నియంతృత్వ ధోరణితో అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాడులు, దౌర్జన్యాలను ప్రోత్సహిస్తోంది. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి నివాసంపై గురువారం జరిపిన పోలీసుల దాడిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టులు, రాజకీయపక్షాలు, మేధావులు ముక్తకంఠంతో ఖండించారు. నిరసనలు తెలిపి కూటమి తీరుపై భగ్గుమన్నారు. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంతో సహా ప్రధాన నియోజకవర్గాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందించారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరులో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. సిట్ బృందం పేరుతో అక్రమ దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేసేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం నీతిమాలిన చర్య అని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షుడు కె.కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మాణిక్యాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, యూనియన్ సభ్యులు, సాక్షి పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- చింతలపూడిలో ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేసి సీఐ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు.
- ఉంగుటూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులు నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..

భీమవరంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, కక్ష సాధింపు చర్యలు ఆపాలంటూ తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.

- నరసాపురం నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నరసాపురంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరులు నిరసన తెలిపి సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ సాయికృష్ణకు వినతిపత్రం అందజేశారు.
- ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండలో జర్నలిస్టులు నిరసన తెలిపి తహసీల్దార్ డి.అనితకుమారికి వినతిపత్రం అందించారు.
- తణుకులో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్ బి.అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు.
- తాడేపల్లిగూడెంలో 'సాక్షి' విలేకరులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- ఉండి నియోజకవర్గం ఆకివీడులో పాత్రికేయులు నిరసన తెలిపి తహసీల్దార్ ఎ.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అంబటి రమేష్ సంఘీభావం తెలిపారు.

మీడియా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు

కొయ్యలగూడెం: మీడియా స్వేచ్ఛకి కూటమి ప్రభుత్వం గొడ్డలి పెట్టులా మారిందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధ్వజమెత్తారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ప్రభుత్వం పోలీసు దాడులను చేయించడాన్ని నిరసిస్తూ గురువారం బయ్యనగూడెంలోని జాతీయ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి సేవ్ ఫోర్త్ ఎస్టేట్, సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని ప్రారంభమైన దాడులు ఇప్పుడు మీడియా వ్యవస్థ మీదకి పురికొల్లేలా మారాయన్నారు. కూటమిలో పార్టీలు బీజేపీ, టీడీపీ, జనసేనలు కక్ష, పగ, ప్రతీకారాలను పంచుకున్నాయని ఎద్దేవా చేశారు. చర్యకు ప్రతి చర్య తప్పనిసరిగా ఉంటుందని అది ప్రజాక్షేత్రం ద్వారానే కూటమి ప్రభుత్వానికి జగన్ 2.0 పాలనలో రుచి చూపిస్తామని బాలరాజు హెచ్చరించారు.



బయ్యనగూడెంలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, నాయకులు



తణుకు అర్బన్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు



నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్ట్ సంఘ సభ్యులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు



చింతలపూడి: సీఐకి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

న్యూస్‌రీల్

కుట్టు మెషీన్ల పంపిణీలో అవినీతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి, నాయకులు

యలమంచిలి: మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం రూ.245 కోట్ల అవినీతికి పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆరోపించారు. ఈ మేరకు గురువారం పార్టీ నాయకులతో కలిసి పాలకొల్లు డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కుట్టుమెషీన్ ధర రూ.4,300, శిక్షణకు రూ.3 వేలు మొత్తం రూ.7,300 ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడి నిమిత్తం రూ.23,000 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇలా రూ.245 కోట్లు కొట్టేసే పనిలో ఉందని ఆరోపించారు. అవినీతిలో అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్ల పాత్ర ఉందని, విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు యడ్ల తాతాజీ, పార్టీ పాలకొల్లు పట్టణ, యలమంచిలి, పోడూరు మండలాల కన్వీనర్లు కోరాడ శ్రీనివాసరావు, ఉచ్చుల స్టాలిన్‌బాబు, కొత్రపాటి వీరాస్వామి, యలమంచిలి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు వినుకొండ రవి, రావూరి బుజ్జి, మద్దా చంద్రకళ, శంకరపు శ్రీను, దేవ రాజేష్, గుడాల సురేష్, రావి నాగేశ్వరరావు, పెదపాటి పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

తలసేమియా సేవలు విస్తృతం



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

భీమవరం అర్బన్: జిల్లాలో తలసేమియా సేవలను విస్తృతం చేస్తున్నామని కలెక్టర్, ఐఆర్‌సీఎస్ అధ్యక్షురాలు సీహెచ్ నాగరాణి అన్నారు. రాయలం గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ భవనంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం ఆరు పడకల డేకేర్ సెంటర్‌ను ఆమె ప్రారంభించామన్నారు. ఉచిత సేవలకు చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.మౌనిక ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన యూఎన్‌ఓ ఫీడ్స్ కంపెనీ సిబ్బందికి సర్టిఫికెట్లు అందించారు. తలసేమియా సెంటర్‌కు రూ.లక్ష చొప్పున విరాళం ఇచ్చిన తిరుపతిరాజు, కె.రాధాకృష్ణమూర్తిలను కలెక్టర్ సన్మానించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ ఎంఎస్‌వీ శివ రామభద్రిరాజు, వైస్ చైర్మన్ కె.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో సాంకేతికతతో అధిక ఉత్పత్తి

ఉండి: ఆక్వాకు మారు పేరుగా పశ్చిమగోదావరి జిల్లా నిలిచిందని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా ఎన్నార్పీ అగ్రహారం మత్స్య పరిశోధనా కేంద్రంలో ఆక్వాలో సాంకేతిక తదితర అంశాలపై జరుగుతున్న అవగాహన, శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా జేసీ మాట్లాడుతూ ఆక్వాలో సాంకేతిక పరిజ్ఞానం, రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆక్వాలో ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆక్వా సాగులో మెలకువలు నేర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. జిల్లాలో 1.33 లక్షల ఎకరాలకు గాను 49 వేల ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. రైతులు సాగులో నూతన పద్ధతులు తెలుసుకునేందుకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (హైదరాబాద్) సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆక్వా రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచారి, డైరెక్టర్ ఫిషరీస్ అభిషేక్, ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ సుగుణ, ఎంపెడా ఫీల్డ్ అధికారి దుర్గారావు పాల్గొన్నారు.

సీపెట్ కోర్సులకు దరఖాస్తులు

నూజివీడు: విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ అర్హతతో మూడేళ్ల కాలపరిమితి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టింగ్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. సీపెట్ వెబ్‌సైట్‌లో ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లోకలే బెటరొయ్యా

రొయ్య చూపు.. లోకల్ వైపు

- 'రెడీ టూ కుక్' పేరిట స్థానిక విక్రయాలపై రైతుల దృష్టి
- భీమవరం, వీరవాసరం, నరసాపురంలో ప్రత్యేక కౌంటర్లు
- 'డొమెస్టిక్ సేల్స్'కు గతంలోనే కార్యాచరణ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 250 ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్స్ ఏర్పాటు



భీమవరం రైతు బజారులో ఏర్పాటుచేసిన రొయ్యల రిటైల్ సేల్స్

సాక్షి, భీమవరం: సిండికేటు దోపిడీతో కుదేలవుతున్న ఆక్వా రంగాన్ని కాపాడుకునే దిశగా రొయ్యల రైతులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా లోకల్ మార్కెట్‌ను పెంచుకునే పనిలో పడ్డారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి 'రెడీ టు కుక్' పేరిట రైతులే రొయ్యల అమ్మకాలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని భీమవరం, వీరవాసరం, నరసాపురంలో అమ్మకాలు మొదలుకాగా ఇతర జిల్లాలకూ విస్తరించే పనిలో నిమగ్నమయ్యారు.

'పశ్చిమ'లో 3 లక్షల టన్నుల ఉత్పత్తి

రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులు ఉండగా.. అత్యధికంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే 2.63 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 60 శాతం విస్తీర్ణంలో ఏటా సుమారు 3 లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎక్స్‌పోర్టర్స్ ఏకమై రొయ్య ధరలను ఇష్టానుసారం తగ్గించడం, మేత ధరలను పెంచడంపై ఆక్వా రైతులు మండిపడుతున్నారు. వారి దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో జూలై నుంచి సెప్టెంబర్ వరకు సాగు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే పలువురు రైతులు సాగు సమ్మెకు శ్రీకారం చుట్టి చెరువులను ఎండగట్టేశారు.

స్థానిక వినియోగం పెంచేందుకు..

స్థానిక వినియోగం పెంచడం ద్వారా సిండికేట్ దోపిడీకి కళ్లెం వేయాలన్న యోచనలో రొయ్య రైతులు ఉన్నారు. అందుబాటులో ఉండేలా వివిధ కౌంట్లలోని రొయ్యలను ప్రాసెసింగ్ చేసి 150 గ్రాముల నుంచి 300, 500 గ్రాములు, కిలో వరకు వివిధ పరిమాణాల్లో ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. భీమవరానికి చెందిన ఆక్వా రైతు గాదిరాజు వెంకట సుబ్బరాజు రైతు బజార్‌లో రిటైల్ అమ్మకాలను ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా రొయ్య రైతుల ఆధ్వర్యంలో ప్రాన్స్ పర్చేసింగ్ డొమెస్టిక్ యూనిట్ పేరిట వీరవాసరంలో ఔట్‌లెట్ ఏర్పాటుచేశారు. కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం ద్వారా ఇతర జిల్లాలకూ ఔట్‌లెట్లను విస్తరించే యోచనలో ఉన్నట్టు రైతులు చెబుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో డోర్ డెలివరీ

నరసాపురానికి చెందిన ఆక్వా రైతు కర్రి రామకృష్ణ 'టేస్టీ ప్రాన్స్' పేరిట 4 నెలలుగా ప్రాసెసింగ్ చేసిన రొయ్య పప్పును ఆర్డరుపై ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వినియోగదారులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూ సగటున రోజుకు 200 కిలోల రొయ్య పప్పు వరకు అమ్మకాలు చేస్తున్నారు. పాలకొల్లులో కొందరు రైతులు సుమారు రూ.30 లక్షలతో డొమెస్టిక్ సేల్స్ కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే..

ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రొయ్యలను స్థానిక వినియోగదారులకు డోర్ డెలివరీకి గతంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేసింది. దీనికి ఏపీ రొయ్య రైతుల ఫెడరేషన్ అప్పట్లో ముందుకు వచ్చింది. ఎక్స్‌పోర్టు తరహాలో ప్రాసెస్ చేసిన రొయ్య పప్పు కిలోకు కౌంట్‌ను బట్టి రూ.600 నుంచి రూ.850 వరకు ధర నిర్ణయించారు. తొలుత ప్రయోగాత్మకంగా భీమవరం పరిసర ప్రాంతాల్లో అమలుచేసి తర్వాత రాష్ట్రవ్యాప్తం చేయాలని భావించారు. అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేయగా.. ఎన్నికల హడావుడి మొదలవడంతో కార్యరూపం దాల్చలేదు. సీ ఫుడ్ డొమెస్టిక్ వినియోగం పెంచేందుకు అప్పట్లోనే ఫిష్ ఆంధ్రా పేరిట సబ్సిడీపై రూ.లక్ష నుంచి రూ.3 లక్షల విలువైన 250కు పైగా ఔట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ఫోర్, టూ వీలర్స్‌ను అందించారు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు



నాలుగు ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నాను. కొద్ది నెలల క్రితం సొంతంగా రొయ్యలు ప్రాసెసింగ్ చేసి డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాం. తక్కువ ధరకే క్వాలిటీ రొయ్య పప్పు ఇవ్వడంతో లోకల్ సేల్స్‌తో పాటు ఏపీ, తెలంగాణ నుంచి ఆర్డర్లు బాగా వస్తున్నాయి.

– కర్రి రామకృష్ణ, ఆక్వా రైతు, నరసాపురం

స్థానిక వినియోగం పెరిగేలా..



లాభాపేక్షతో కాకుండా అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన రొయ్యలు అందించడమే మా ఉద్దేశం. స్థానిక వినియోగం పెరిగితే సిండికేట్ ఆగడాలకు కళ్లెం పడుతుంది. పాలకొల్లులో కొందరు రైతులు కలిసి యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

– బోణం చినబాబు, ఆక్వా రైతు, పాలకొల్లు

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



ధ్వజ పటానికి హారతులిస్తున్న అర్చకులు



హంస వాహనంపై గ్రామోత్సవం

అట్టహాసంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న బ్రహ్మోత్సవాలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ గురువారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుక నేత్రపర్వమైంది. అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఉదయం ఆలయంలో ఉత్సవ నిత్యహోమ గ్రామ బలిహరణలు, వేద స్వస్తి, సాయంత్రం రుత్విగ్వరణ, మృద్గ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామివారు మత్స్యావతార అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంకురార్పణ జరిగిందిలా..

సాయంత్రం ఆలయంలో ఒక వాహనంపై విష్వక్సేనుని ఉంచి అలంకరించారు. అనంతరం అర్చకులు పుట్టమన్నును తెచ్చి, ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పాలికల్లో ఉంచారు. అనంతరం అంకురార్పణ జరిపించారు. గరుడ పటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ వేడుకలు నిర్వహించి భక్తులకు గరుడ ప్రసాదాన్ని పంచిపెట్టారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

ఐజీ అశోక్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

భీమవరం: శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే ప్రథమ కర్తవ్యంగా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన శాంతి భద్రతలపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కీలకమైన కేసులు, పాత నేరస్తులు, సస్పెక్ట్ షీట్స్ తదితర అంశాలపై సమీక్షించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. పోక్సో వంటి కేసుల్లో 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ముందుగా ఐజీ అశోక్‌కుమార్‌కు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీలు ఆర్.జయసూర్య, జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, ట్రైనీ డీఎస్పీ కె.మానస, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు డి.సురేష్, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలపై కేసులు



రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రవాణా వాహనాలకు చెల్లించాల్సిన పన్ను గడువు ఏప్రిల్ 30వ తేదీతో ముగిసినప్పటికీ, కొందరు రవాణా వాహన యజమానులు త్రైమాసిక పన్ను చెల్లించకుండా వాహనాలను రహదారులపై తిప్పుతున్నారని డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. దీనిపై ఈ నెల ఒకటవ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో రవాణా వాహనాలపై 115 కేసులు నమోదు చేసి, రూ.7.53 లక్షలను అపరాధ రుసుముగా విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని, స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తే పన్నుతో పాటు 50 శాతం మాత్రమే అదనంగా చెల్లిస్తే సరిపోతుందని కరీమ్ తెలిపారు. రవాణా వాహనాలకు క్రమం తప్పకుండా టాక్స్, బీమా చెల్లిస్తూ, పర్మిట్, పొల్యూషన్, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని అయన వాహన యజమానులకు సూచించారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం: పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. వివరాల ప్రకారం రెండో పట్టణానికి చెందిన ఆరో తరగతి చదువుతున్న బాలిక ఇంటి బయట ఆడుకుంటుండగా ఆమెను 64 ఏళ్ల వయసున్న బాబూరావు ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించినట్లు బాధిత బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ధాన్యం లారీ బోల్తా



ధాన్యం లారీ చెరువులో బోల్తా పడిన దృశ్యం

ఉంగుటూరు: ధాన్యం లారీ బోల్తా పడి ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాకర్లమూడికి చెందిన రైతులు మార్నిడి వందనాదేవి, చేదునూరి శివ పార్వతి, ఉర్రింకల వీరవెంకట సత్యవరప్రసాద్‌లకు చెందిన 500 సార్ల ధాన్యం ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామంలోని చంద్రావతి రైస్ అండ్ ఫ్లోర్‌మిల్లుకు తరలించేందుకు లారీలో లోడ్ చేశారు. బుధవారం రాత్రి 11 గంటలకు కాకర్లమూడి నుంచి బయలుదేరిన ఈ లారీ కొద్దిసేపటికే రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.

అభయారణ్యంలో అక్రమ పట్టుబడులు

- రాజకీయ నేతల అండతో బరితెగింపు
- కొల్లేరు గర్భానికి తూట్లు
- చటాకాయి గ్రామంలో అక్రమ సాగుకు అంతే లేదు
- అమలు కాని సుప్రీం కోర్టు నిబంధనలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కొల్లేరు అభయారణ్యంలో అక్రమ సాగు యథేచ్ఛగా సాగుతోంది. సుప్రీం కోర్టు ఒక పక్క అక్రమ చేపల చెరువులను ధ్వంసం చేయాలని అటవీశాఖకు ఆదేశాలు ఇస్తున్న తూతూ మంత్రంగా అక్రమ చెరువులకు గండ్లు కొట్టి మమా అనిపిస్తున్నారు. కైకలూరు మండలం చటాకాయి గ్రామంలోని కొల్లేరు అభయారణ్యంలో 355 ఎకరాల విస్తీర్ణంలో 9 చెరువుల్లో అక్రమ సాగు చేస్తున్నారు. వీటిలో నిషేధిత కోడి వ్యర్థాలతో సైతం సాగు జరుగుతోంది. చటాకాయి అక్రమ చెరువుల్లో గురువారం నుంచి పట్టుబడులు యథేచ్ఛగా ప్రారంభమయ్యాయి. సాధారణంగా చేపల చెరువుల కంటే రొయ్యల చెరువుల్లో రసాయనాలు అధికంగా వాడతారు. దీంతో కొల్లేరు పర్యావరణం మరింతగా పాడవుతోంది. చటాకాయిలో ఏకంగా చేపలు, రొయ్యలను కలపి అభయారణ్యంలో సాగు చేస్తున్నారు.



కైకలూరు మండలం చటాకాయి గ్రామంలో అక్రమ పట్టుబడుల దృశ్యం



చటాకాయిలో అక్రమ సాగుతో పట్టుబడులు చేసిన రొయ్యలు



చటాకాయి గ్రామ చెరువులో రొయ్యల ఫ్యాన్ సెట్లు

తూతూమంత్రంగా చెరువులకు గండ్లు

కైకలూరు మండలం చటాకాయి గ్రామంలో 1500 మంది జనాభా ఉన్నారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి(165) నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తే చటాకాయి చేరుకోవచ్చు. ఇటీవల అక్రమ చేపల చెరువులకు గండ్లు పెట్టడానికి అటవీశాఖ అధికారులు వస్తే చటాకాయి గ్రామం ప్రారంభంలోనే గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులతో చర్చలు జరిపి ఏదో విధంగా ఓ రెండు చెరువులకు అటవీ సిబ్బంది గండ్లు పెట్టారు. ఉన్నతాధికారులకు నివేదించడానికి చెరువు గట్టు గండ్లను ఫోటోలు తీసుకున్న తర్వాత తిరిగి చెరువు యథాస్థితికి చేరటం ఇక్కడ పరిపాటిగా మారింది.

లీజుల వాటాలు తీసేస్తున్నారు

గ్రామ పరిధిలో అక్రమ సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో పురుషులు పంచుకుంటారు. ఏడాదికి ఒక్కో తలకు రూ.10,000 వస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో వారి మాటకు ఎదిరించినవారిని, బయట ఊరి నుంచి వచ్చి స్థిరపడిన వారిని, పూర్వం మాజీ ముఖ్యమంత్రి జలగళం వెంగళరావు ఇచ్చిన సొసైటీ భూముల్లో పేర్లు లేవనే వంకతో దాదాపు 300 మందికి కొన్ని చెరువుల్లో లీజులు తీసివేశారు. ఇదే కాకుండా ఒకరికి రూ.10,000 లీజు వస్తేంటే మరొకరికి కేవలం రూ.1000 అందిస్తున్నారు. గ్రామ సర్పంచ్ కూడా బాధితుల లిస్టులో ఉండటం గమనార్హం. ఈ విషయమై గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు లిఖిత పూర్వంగా ఫిర్యాదు సైతం చేశారు. అక్రమ చెరువుల్లో లీజులు సమానంగా పంచకపోతే, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసి చెరువుల మొత్తాన్ని ధ్వంసం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామస్తుల ఫిర్యాదుపై అతీగతి లేదు.

అమాయక ప్రజల జీవితాలతో ఆటలు

కొల్లేరు అమాయక ప్రజల జీవితాలతో నాయకులు ఆటలాడుతున్నారు. ఇదిగో కొల్లేరు ఇచ్చేస్తున్నారు? అదిగో కొల్లేరు కాంటూరు కుదించేస్తున్నారు? అంటూ చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు సుప్రీం నిబంధనల మేరకు గండ్లు కొట్టడానికి వెళితే గ్రామంలో మహిళలతో ధర్నాలు చేయించి, ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరిస్తున్నారు. ఈ గ్యాప్‌లో కొల్లేరులో పాత చెరువుల రిపేర్లు పేరుతో అందినకాడికి తవ్వేస్తున్నారు. ఇదేంటనీ అడిగే నాథుడే కనిపించడం లేదు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు అక్రమ పట్టుబడులు, అనుమతులు లేని రిపేర్ల వైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు.

అక్రమ చెరువులకు గండ్లు కొట్టాం



కొల్లేరు అభయారణ్యంలో అక్రమ చేపల చెరువులకు సుప్రీం కోర్టు ఆదేశాలతో గండ్లు కొట్టించాం. కొల్లేరు గ్రామాల ప్రజలకు ముందుగా సుప్రీం కోర్టు నిబంధనలపై అవగాహన కల్పించాం. కొల్లేరు అభయారణ్య చట్టాలను పరిరక్షించుకోవడం అందిరి బాధ్యత. కొల్లేరులో అక్రమ సాగు వివరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం.

– కె.రామలింగాచార్యులు, అటవీశాఖ రేంజర్, ఏలూరు

మైనర్ బాలికలను వసతి గృహాలకు తరలింపు

- ఒకరి బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్
- మరోచోట సచివాలయంలో ఫిర్యాదు చేసిన బాలిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహాలు చేయడం నేరమని అధికారులు ఎంత చెబుతున్నా.. ఇంకా ఏదో ఒక చోట ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో ఓ మైనర్ బాలికకు మరో రెండు రోజులు వివాహం చేయనుండగా విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు అడ్డుకుని బాలికలను వసతి గృహానికి తరలించారు. మరో ఘటనలో మైనర్ బాలికకు గత నెల వివాహం కాగా ఆమె సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో ఆమెను కూడా వసతి గృహానికి తరలించారు. వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం 31వ వార్డులో ఓ మైనర్ బాలికకు ఈ నెల 10వ తేదీన వివాహం జరుగుతుందని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు కె.విశాలాక్షి, సీహెచ్ దుర్గ భవానీ, మహిళా పోలీస్ చాంద్ సుల్తానా, టౌన్ పీఎస్ కానిస్టేబుల్ శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్త రత్నం ఆధ్వర్యంలో మైనర్ బాలిక నివాసానికి వెళ్లి ఆ వివాహం నిలుపుదల చేశారు. సదరు బాలికను తణుకు కళాశాల వసతి గృహంనకు తాత్కాలిక వసతి నిమిత్తం తరలించారు. సదరు బాలికను ఏలూరు సీడబ్ల్యూసీ ముందు శుక్రవారం హాజరపరచనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెల్లడించారు.

సచివాలయంలో ఫిర్యాదు చేసిన బాలిక

స్థానిక 10వ వార్డుకు చెందిన మైనర్ బాలికకు ఏప్రిల్ 11వ తేదీన వివాహం చేశారు. ఆ పెళ్లి తనకు ఇష్టం లేదని గురువారం బాలిక 10వ వార్డు సచివాలయం మహిళా పోలీస్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. దీంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు కె.విశాలాక్షి, సీహెచ్ దుర్గ భవానీలతో పాటుగా మహిళా పోలీస్ ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీబాయి వెళ్లి సదరు బాలికను ఏలూరు సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచారు. ఆ బాలికను హనుమాన్ జంక్షన్‌లోని ప్రజ్వల హోంకు తాత్కాలిక వసతి నిమిత్తం తరలించారు.

ఆపరేషన్ సిందూర్.. సరైన నిర్ణయమే



దంగేటి రామలింగేశ్వరరావు
మాజీ సైనికోద్యోగి

ఉండి: పాకిస్థాన్‌లోని తీవ్రవాదులపై భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సరైన చర్య అని మాజీ సైనికోద్యోగి హవల్దార్ దంగేటి రామలింగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పహల్గాం ఘటన తనను ఎంతగానో కలచివేసిందని, పాకిస్థాన్ ఉగ్రమూకలు అభాగ్యులను నిర్దాక్షిణ్యంగా చంపడం చాలా చాలా దారుణమన్నారు. దీనికి బదులుగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు తన సెల్యూట్ తెలియజేశారు. టెర్రరిజంపై భారత్ పోరాటం నిజమైనదని అందుకే ప్రపంచ దేశాలు అండగా నిలుస్తున్నాయని అన్నారు. రిటైర్డ్ అయిన మా సేవలు అవసరమైతే మేమంతా సిద్ధంగా ఉంటామని, ఇది మాజీ సైనికోద్యోగుల పక్షంగా తాను చెబుతున్నానని తెలిపారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఎక్కువగా జనం ఎక్కడైతే వుంటారో అక్కడే టార్గెట్ చేసే అవకాశం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీ వారంతా అప్రమత్తంగా వుండాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరైనా కొత్తవారు అనుమానితులుగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మాజీ హవల్దార్ తెలిపారు.

10న వాలీబాల్ శిక్షణకు క్రీడాకారుల ఎంపిక

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ వాలీబాల్ శిక్షణ శిబిరం ఈనెల 15వ తేదీన ప్రారంభిస్తున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ వర్మ, జి రాఘవేంద్రరావు గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు శిక్షణ నిర్వహిస్తామని శిక్షణలో పాల్గొనే 14 నుంచి 20 ఏళ్ల లోపు క్రీడాకారులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు డీఎన్నార్ కళాశాలలో నిర్వహించే ఎంపికకు హాజరుకావాలన్నారు. వివరాలకు 99899 22122, 98669 22122 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రికి కేంద్ర గుర్తింపు



ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యసిబ్బంది

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి కేంద్ర గుర్తింపు(నేషనల్ అక్రెడిషన్) లభించిందని, త్వరలో సర్టిఫికెట్ జారీ కానుందని వైద్యాధికారి కస్తూరి శిరీష గురువారం విలేకరులకు తెలిపారు. అనేక దీర్ఘ కాలిక, మొండి వ్యాధులకు ఆయుర్వేద వైద్యంలో ఉపశమనం లభిస్తుందన్నారు. ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో 25 పైగా ఔషధ మొక్కలు ఉన్నాయని, కటి వస్తి, జాను వస్తి, మొదలైన పంచకర్మ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంగా అప్‌గ్రేడ్ అయ్యిందని, పంచకర్మ సెంటర్‌గా ప్రభుత్వం గుర్తించిందని డా.శిరీష పేర్కొన్నారు. తద్వారా ఖరీదైన, నాణ్యమైన ఔషధాలు, పంచకర్మ చికిత్సలను ఉచితంగా ప్రజలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు.

ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగింత



బాధితురాలికి బ్యాగ్, నగదు అందిస్తున్న రైల్వే కానిస్టేబుల్ బాల

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న బ్యాగ్‌ను వృద్ధురాలికి రైల్వే పోలీసులు అప్పగించిన ఘటన ఇది. తమిళనాడుకు చెందిన అంబిక గురువారం సాయంత్రం సర్కారు ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు తణుకు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అదే సమయంలో తన బ్యాగ్ కనిపించకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వే ఎస్సై సుబ్రహ్మణ్యం ఆదేశాలతో రైల్వే కానిస్టేబుల్ ముద్దే బాల వెంటనే బ్యాగ్‌తోపాటు నగదును కూడా గుర్తించి బాధితురాలికి అప్పగించారు. సకాలంలో స్పందించిన రైల్వే పోలీసులపై బాధితురాలితోపాటు ప్రయాణికులు ప్రశంసల జల్లు కురిపించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



కోటా రాము (ఫైల్)

భీమడోలు: మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం పోలసానిపల్లి గ్రామానికి చెందిన కోటా రాము (45) మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. దీంతో భార్య అతడిని మందలించగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి గురైన రాము గురువారం తన ఇంటిలోని రేకుల షెడ్డు దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామును కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తరలించారు. భీమడోలు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. మృతుడు రాముకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తమ సర్టిఫికెట్లు ఇప్పించాలని పూర్వ విద్యార్థుల ధర్నా

జంగారెడ్డిగూడెం: తమ సర్టిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం వేగవరం నోవా కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు ధర్నాకు దిగారు. వారు తెలిపిన వివరాలివి. వేగవరం నోవా కళాశాలలో 2015 నుంచి 2020 మధ్యకాలంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు టీటీసీ, బీఈడీ, బీపీఈడీ, డిగ్రీ తదితర కోర్సులు అభ్యసించారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థుల నుంచి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్స్ తీసుకున్నారు. కోర్సులు పూర్తయిన తరువాత సదరు సర్టిఫికెట్లను విద్యార్థులకు తిరిగి ఇవ్వలేదు. అప్పటి నుంచి సర్టిఫికెట్ల కోసం కాలేజ్ చుట్టూ తిరుగుతూనే ఉన్నామని పూర్వ విద్యార్థులు విజయలక్ష్మి, సత్యనారాయణ, దుర్గారావు, అవినాష్, సాగర్, సుధీర్, సాయి, అనూష తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తమ సర్టిఫికెట్లు తమకు ఇవ్వాలని గురువారం విద్యార్థులు విద్యాసంస్థల కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ధర్నా అనంతరం జంగారెడ్డిగూడెం ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృత అభిషేకాలు



శ్రీకృష్ణస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మోహినీ ఏకాదశి, వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గురువారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో నెలవైన శ్రీకృష్ణ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

ఆపరేషన్ సిందూర్ పాక్‌కు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని, పాక్‌కు హెచ్చరికగా పని చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత సైన్యం పాక్‌తో పాటు పీఓకేలో తొమ్మిది ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా దాడి చేసిందన్నారు. ఈ ఘటనలో దేశ శక్తిని ప్రపంచ దేశాలకు చాటారని కొనియాడారు. కార్యక్రమంలో కంచుమర్తి నాగేశ్వరరావు, దత్తు ప్రసాద్, దువ్వా శ్రీనివాస్, రామగాని సత్యనారాయణ, చిట్యాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగారాయుడిగూడెం గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీసోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని చలి నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ దర్శించుకున్నారు. ఉప సర్పంచ్ కాసాని రాంబాబు, రామకృష్ణ, శ్రీను, శివ, నిమ్మల కోటేశ్వరరావు, వెంకననబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మి నగర్, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్లకు సంబంధించి విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. సబ్‌స్టేషన్ పరిధిలో డీఎస్ చెరువు, ఝాన్సీ రాణి ఆసుపత్రి, పంపుల హౌస్ ఏరియా, మహాలక్ష్మి నగర్, సత్యవతి నగర్, చెట్లు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డివిజన్ ఈఈ కోరారు.

వ్యవసాయ రుణాలపై అవగాహన

కాళ్ల: మండలంలోని కోపల్లెలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్, భీమవరం ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ శిబిరంలో రైతులకు వివిధ రకాల వ్యవసాయ రుణాలు, అర్హతలు, ప్రభుత్వ మద్దతుపై వివరించారు. పలువురు రైతులు తమ రుణ అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు అధికారులు వారి సందేహాలను నివృత్తి చేసి, రుణాల మంజూరుకు సూచనలు ఇచ్చారు. అనంతరం రుణం మంజూరైన రైతులకు రుణ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ వెంకన్న బాబు, జిల్లా లీడ్ బ్యాంకు అధికారి నాగేంద్ర ప్రసాద్, చీఫ్ మేనేజర్లు శ్రీధర్, లావణ్య, వెటర్నరీ ఏడీ మల్లేశ్వరరావు, ఎఫ్‌డీఓ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

భీమవరం: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపట్టే సమ్మెలో భీమవరం పట్టణంలోని మునిసిపల్ వర్కర్స్‌యూనియన్స్ పాల్గొంటున్నట్లు యూనియన్ నాయకులు గురువారం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 40 లేబర్ కోడ్స్ రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్‌ను అమలుచేయడాన్ని నిరసిస్తూ సమ్మె చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కిల్లరి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లోనే సేవలు

- నగంలో నిలిచిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం
- ఎప్పటికి పూర్తయ్యేనో...?



నిర్మాణం సగంలో నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం



శిథిల భవనంలోనే నిర్వహిస్తున్న సివిల్ సప్లై కార్యాలయం



పాత తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్నికల కార్యాలయం



ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తున్న మండల విద్యాశాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిలోనే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధానంగా సివిల్ సప్లై, ఎలక్షన్, గ్రామ రెవెన్యూ అధికారులు శిథిల భవనాల్లోనే సంబంధిత శాఖ అధికారులు సేవలు అందించే పరిస్థితి దాపురించింది. తహసీల్దార్ కార్యాలయానికి 2018 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. అయితే సగంలోనే ఈ భవన నిర్మాణం నిలిచింది. దాదాపు ఏడేళ్లుగా ఈ భవనం నిర్మాణం ముందుకు సాగని పరిస్థితి. దీంతో నాడు వీఆర్వోల కోసం నిర్మించిన భవనంలోనే ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. దీనిలోనే కొంత కాలం ఆర్డీవో కార్యాలయం కొనసాగింది. అయితే ఆర్డీవో కార్యాలయాన్ని ఆర్ అండ్ బీ బంగ్లాకు తరలించారు. ఈ నేపథ్యంలో పాత తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వారి కార్యాలయం నడుస్తోంది. ఇక సివిల్ సప్లై కార్యాలయం గురించి చెప్పుకోనవసరం లేదు. పాత ఎన్నికల కార్యాలయంలోనే సివిల్ సప్లై అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక మండల విద్యా శాఖ అధికారి కార్యాలయం మండల పరిషత్ కార్యాలయంలోని ఒక గదిలో ఏర్పాటు చేశారు. ఈ గదిలోనే ఇద్దరు ఎంఈవోలు, కంప్యూటర్ విభాగం కొనసాగుతుంది. మండల పరిషత్‌లో ఒక భాగమైన ఉపాధి హామీ పథకం కార్యాలయానికి మండల మహిళా సమాఖ్య భవనం పైఅంతస్తును కేటాయించారు. నేటికీ ఈ భవనం పూర్తి కాలేదు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలోని ఒక గదిలో ఉపాధి హామీ పథకం కార్యాలయం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సిబ్బంది మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనూ, ఆరు బయట కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

రానున్నది వర్షాకాలం

ప్రస్తుతం శిథిలావస్థ భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయాలకు రానున్న వర్షాకాలం ప్రాణసంకటమని స్పష్టమవుతుంది. ప్రధానంగా ఎన్నికల కార్యాలయం, సివిల్ సప్లై, హౌసింగ్ తదితర కార్యాలయాల పైభాగం లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో వర్షాకాలంలో శ్లాబు నుంచి నీరు కిందకు చెమర్చే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయా కార్యాలయాల్లోని రికార్డులు, కంప్యూటర్లు వంటి విభాగాలు తడిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల మంజూరు

అత్తిలి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.68.80 లక్షలతో నిర్మించే రక్షిత మంచినీటి పథకానికి భూమిపూజ చేశారు. అనంతరం కంచుమర్రులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొలమరశెట్టి నాగేశ్వరరావు, పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఐనంపూడి శ్రీదేవి, ఆనాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ఉపాధి హామీ పథకం శ్రామికులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం ఉపాధి హామీ పథకం శ్రామికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు చేయడానికి, సమస్యల పరిష్కారానికి సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. ధనలక్ష్మి, గజ్జరపు రంగారావు, మడిచర్ల సోమరాజు, ఉపాధి మేట్లు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై పాత్రికేయుల నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి చొరబడి సోదాలు నిర్వహించడం పట్ల ఏపీయూడబ్ల్యూజే గూడెం నాయకులు ఖండించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పాత్రికేయులు గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ నోటీస్ లేకుండా ఒక పత్రిక ఎడిటర్ ఇంట్లో సోదాలు చేయడం తగదన్నారు. ఈ విషయాన్ని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతి వరప్రసాద్ ఒక ప్రకటనలో ఖండించారు. అనంతరం తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు యడ్లపల్లి మురళీ కృష్ణ, పాత్రికేయులు కొడమంచిలి ఆశీర్వాదరావు, కట్రెడ్డి శ్రీనివాసరావు, బుద్దన శ్రీకాంత్, కొండవీటి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

తణుకు అర్బన్: సాక్షి ప్రత్రిక చీఫ్ ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసుల అక్రమ సోదాలు, దురుసు ప్రవర్తనను తణుకులో జర్నలిస్టులు ఖండించారు. జర్నలిజానికి ఉన్న స్వేచ్ఛను హరించే విధంగానూ, మీడియాకు సంకెళ్లు వేసే పరిస్థితుల్లో పోలీసుల తీరు కనిపిస్తోందంటూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు ముందస్తుగా ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తణుకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దారు దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యుఏజే జిల్లా మాజీ కార్యదర్శి కొడమంచిలి కృష్ణ, తణుకు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొండ రామ్‌కుమార్, పాత్రికేయులు తానేటి దొరబాబు, శ్రీకాకుళపు సత్యప్రసాద్, మద్దిపాటి కనకేశ్వరరావు, గాదిరెడ్డి రామ్‌ప్రసాద్, గుమ్మడి ఆంజనేయులు, మడిపల్లి సాయి, బడేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం మునిసిపల్ కార్మికులు నిర్వహించిన 17 రోజుల సమ్మె, ఇచ్చిన హామీలకు జీఓలు ఇచ్చి అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు పెంచాలని, చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడికొండ జయరాం కృష్ణ, కొడమంచిలి బాబు, తాడికొండ శ్రీను, ధనరాజ్, ధనాల శివయ్య, కె.మంగ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నగ్రంథాలయ సిబ్బంది



అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. పదో రోజు గురువారం రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, తెలుగు నెలల పేర్లు చెప్పించారు. ఎ.జనార్ధనరావుచే పుస్తక సమీక్ష, ఆట, పాటలు నేర్పించారు. బాపయ్య శర్మచే జనరల్ నాలెడ్జ్, కోపెల్ల శ్రీనివాస్‌చే నీతి వాక్యాలు, తంగెళ్ల మురళీకృష్ణ, ఏవీ లక్ష్మణరావులచే పలు అంశాలు నేర్పించారు. గ్రంథాలయ అధికారి బి.మధుసూధనరావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను ఉపయోగించుకోవాలని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు ఈ వేసవి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయాధికారులు, సిబ్బంది, వక్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులు పుస్తక పఠనం చేసి, దేశభక్తి గీతాలను ఆలపించారు. రిసోర్సు పర్సన్లు ఎస్.రమేష్, హేమంత్ కుమార్ రాష్ట్ర రాజధానులను సులభంగా గుర్తుపెట్టుకునే విధంగా మెలకువలను నేర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం రిసోర్సు పర్సన్లు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వేసవి సెలవులను సెల్‌ఫోన్లతో వృథా చేసుకోరాదని, గడిచిన కాలం తిరిగిరాదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు, రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కె.వెంకట్రావు, పి.వెంకటేశ్వరరావు, నంద్యాల దుర్గాప్రసాద్, ఎం.శ్రీదేవి, జి.దివ్య సత్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: కాల పరిమితి ముగిసిన స్ట్రీట్ వెండింగ్ కమిటీలను తిరిగి ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అధికారుల సమావేశంలో కమిషనర్ కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్త కమిటీలను వేయాలన్నారు. వార్డులు, వీధుల్లో చిరు వ్యాపారులు వివరాలను వార్డు వెల్ఫేర్ సెక్రటరీల ద్వారా సర్వేయాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఇలా నమోదైన వ్యాపారులకు మెప్మా సెక్షన్ ద్వారా ఐడీ కార్డులు మంజూరు చేస్తారన్నారు. దీనికి గాను లైసెన్సు కింద రూ.100 చెల్లించాలన్నారు. పట్టణంలో ఉన్న పందుల పెంపకందారుల వివరాలను సర్వే ద్వారా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా పెంపకందారులకు పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఐదు సెంట్ల భూమి కేటాయిస్తారన్నారు. అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు, మేనేజర్ ఎం.రవిసుధాకర్, టీపీఓ వి.జగదీశ్వరరావు, ఏసీపి సీతారాం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న హమాలీలు

తణుకు అర్బన్: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక స్టేట్ వేరింగ్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్స్ (ఎస్‌డబ్ల్యూహెచ్‌సీ) వద్ద హమాలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం గోడౌన్ మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శీలబోయిన శ్రీనివాసరావు, చిటికెన నాగబాబు, ఎస్.గోవిందు, సత్తిబాబు, నూకరాజు, రమణబాబు, బాషా, డి.శ్రీను, ఆసూరి రాజు, పద్దయ్య, శంకరం, ఏసు, సీహెచ్ రమణ, సూర్యనారాయణ, ఏడుకొండలు, గార రంగారావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుగొండ: రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ శ్రీరాంబాబుకు అందిన సమాచారం మేరకు సిద్ధాంతంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 35 కింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొన్నట్లు విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపారు. గురువారం అశోక్ లేలాండ్ వాహనంలో డ్రైవర్ కొల్లేపర మణికంత తీసుకు వెళ్తుండగా ఆపి విచారించగా తణుకు పరిసర ప్రాంతాల్లో ఎన్‌వీ రామకృష్ణ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు నర్సిపూడికి చెందిన ఉండమట్ల మణికంతకు అమ్మినట్లు తెలిపారన్నారు. ఈ మేరకు రూ.1.40 లక్షల విలువైన బియ్యంతో పాటు, రూ.5.85 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిత్యావసరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పెనుగొండ సీఎస్ ఆర్ఐ సత్యనారాయణతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ

పాలకోడేరు: ప్రకృతి విపత్తుల సమయంలో గ్రామ స్థాయి సిబ్బంది ఎలా స్పందించాలనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వి.రెడ్డియ్య తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని మూడు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేశామని, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

శ్రీబాలాజీ వెంకన్నను దర్శించుకున్న కారుమూరి



కారుమూరికి స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అత్తిలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ కల్యాణ మహోత్సవాలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం హాజరయ్యారు. శ్రీస్వామి, అమ్మవార్లను కారుమూరి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కారుమూరి నాగేశ్వరరావుకు స్వామి వారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ప్రతి ఏటా స్వామి కల్యాణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిశెట్టిరాము, యడ్లపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం

తణుకు అర్బన్: జాతీయ రహదారికి సమీపంలో ఉన్న శ్రీధర్మ శాస్త్ర పంచాయతన శ్రీఅయ్యప్ప దేవాలయంలో గురువారం మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు, లోక కల్యాణార్థం అన్నాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల ప్రారంభం



పాతూరు మెట్ల మార్గం వద్ద చేపట్టిన కల్వర్ట్ నిర్మాణ పనులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘ పరిధిలో పదో వార్డు మున్సిపల్ కార్యాలయం నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మెట్ల మార్గంలో పాతూరు, మసీద్ రోడ్డుకు వెళ్లే రహదారి మలుపు వద్ద కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మెట్ల మార్గం పక్కాగా రైల్వే కొలిమిని కలుపుతూ డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. ఎంతో కాలంగా మెట్ల వద్ద రహదారి మార్గంలో డ్రెయినేజీ కల్వర్టు మూసుకుపోవడంతో పలు సమస్యలు వచ్చాయి. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ ఈ సమస్య అపరిష్కృతంగా ఉన్నట్లు సాక్షి దిన పత్రికలో కథనం పలుమార్లు వెలువడింది. అధికారులు ఎట్టకేలకు స్పందించారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం, కల్వర్ట్ శ్లాబ్, వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో అన్ని వైపుల మార్గాలను మూసివేశారు. క్యూరింగ్ చేసిన అనంతరం 30 రోజుల తరువాత ఈ మార్గాన్ని తెరవనున్నారు. వాహనదారులు, పాదచారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఇంజనీర్ వెంకట రమణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.